05ATP27_05ATP27.qxd 08-11-2022 PM 10:29 Page 1



# పీఏబీఆర్ స్పిల్‌వే గేట్లన్నీ మూసివేత..!

-పేరూరు డ్యాం నుండి 1,000 క్యూసెక్కుల నీరు రాక



పీఏబీఆర్ స్పిల్‌వే గేట్లన్నీ మూసివేసి నీటి విడుదలను నిలిపివేసిన దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 8 ప్రభాతవార్త :** పీఏబీఆర్ నుండి దిగువకు నీటి విడు దల మంగళవారం ఆగిపోయింది. ఎగువ నున్న పేరూరు డ్యాం నుండి పీఏబీఆర్‌కు కేవలం 1,000 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పిల్ వే గేట్లన్నీ మూసివేసి దిగువకు నదిలోకి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేసినట్లు డ్యాం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సి.గుర్రయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బి.లక్ష్మిదేవి, హెచ్.గంగమ్మ, కె.ఫాతీమ తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 4.98 టీఎంసీల నీరు నిలువ ఉండగా ఎగువనున్న పేరూరు డ్యాం నుండి 1,000 క్యూసెక్కుల నీరు డ్యాంకు వస్తోందన్నారు. డ్యాం నుండి మొత్తం 1,465 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండగా అందులో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 800 క్యూసెక్కులు, తాగునీటికి 55 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 595 క్యూసెక్కుల నీరు వెళుతోందని వారు వివరించారు.

# సీయంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

-పేదలకు ఎప్పుడూ ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడి



సీయంఆర్‌ఎఫ్ సాయం చెక్కులను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 8 ప్రభాత వార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి (సీయం ఆర్‌ఎఫ్) కింద పలువు రికి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం వజ్రకరూరు మండలం బోడిసానిపల్లిలో జరిగిన కార్యక్రమం లో వజ్రకరూరుకు చెందిన భీమలింగకు 45వేల రూపాయలు, పందికుంటకు చెందిన అశ్వినికు 32వేల రూపాయలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేదలకు వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనీల్‌కుమార్, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీపీ రమావత్ దేవిబాయి, వైస్ ఎంపీపీ సుశీలరాణి, వజ్రకరూరు సర్పంచ్ మోనలిసా, వైసీపీ నాయకులు వశికేరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోడిసానిపల్లి, తండాల్లో కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం

-హాజరైన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



సమస్యలను అడిగి తెలుసుకొంటున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, నవంబర్ 8 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం బోడిసానిపల్లి, బోడిసాని పల్లి తండా గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఆయన ఆయా గ్రామాలకు చేరుకోగానే స్థానిక వైసీపీ కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వం గడిచిన మూడేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే బ్రోచర్లను ప్రజలకు అందించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. పార్టీలు, రాజకీయా లకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని ఈ ప్రభుత్వాన్ని ఆదరించా లని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి సీయం వై.ఎస్.జగన్మో హన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనీల్‌కుమార్, ఇంచార్జ్ ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీపీ రమావత్ దేవిబాయి, వైస్ ఎంపీపీ సుశీలరాణి, వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా, ఎంపీటీసీ ఫిరోజ్‌బాను, పీఏసీఎస్ ఛైర్మెన్ సుధీర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షు డు హనుమంతరెడ్డి, సీనియర్ నాయకులు వశికేరి రమేష్ పాల్గొన్నారు.

**కలెక్టర్‌పట్ల జె.సి.ప్రభాకర్‌రెడ్డి ప్రవర్తించిన తీరు ఆక్షేపనీయం :** తాడిపత్రి మున్సిపల్ ఛైర్మెన్ జె.సి.ప్రభాకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిపట్ల సోమవారం జరిగిన స్పందన కార్యక్రమం ప్రవర్తించిన తీరు ఆక్షేపనీయమని ఆయన కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఏదైనా సమస్య పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలిగాని మహిళా కలెక్టర్‌పట్ల దురుసుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇటీవలి కాలంలో అధికారులపట్ల అభ్యంతరకరంగా వ్యవహరించడం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారిందని విమర్శించారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం

-ఘటన తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్న ప్రిన్సిపాల్, సిబ్బంది



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బోగాల వంశీ తండ్రికు ఆర్థిక సాయం అందిస్తున్న కళాశాల సిబ్బంది

**ఉరవకొండ, నవంబర్ 8 ప్రభాతవార్త :** ఈనెల 5వ తేదీన విడపనకల్లు మండలం మాళాపురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెద్ద కొట్టాల పల్లి గ్రామానికి చెందిన ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలో బీఎస్సీ (బీజెడ్‌సీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బోగాల వంశీ కుటుంబానికి కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ, సిబ్బంది 10వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం విద్యార్థి ఇంటికి వెళ్లిన కళాశాల సిబ్బంది మృతుని తండ్రి మల్లికార్జును పరామర్శించి రోడ్డు ప్రమాద ఘటన తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని వంశీ లేనిలోటు పూడ్చలేనిదని ఆయన ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ఆకాంక్షించారు. బోగాల వంశీ బాగా చదువుకునేవాడని కళాశాల ఒక మంచి విద్యార్థిని కోల్పోయిందన్నారు.

# ఆర్‌డిటి ఆసుపత్రి దగ్గర కొనసాగుతున్న ఎన్టీఆర్ అన్న క్యాంటీన్

-కళ్యాణదుర్గం టీడీపీ పార్టీ కార్యాలయంలో కొనసాగుతున్న అన్న క్యాంటీన్-2 - ప్రతిరోజు మధ్యాహ్నం 1 :00పిఎం గంటలకు వడ్డిస్తారు



అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం టౌన్, నవంబర్ 8 ప్రభాతవార్త :**

మున్సిపాలిటీ కేంద్రం లో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంత రాచౌదరి, వారి కుమారుడు ఉన్నం మారుతి చౌదరిల సేవా నిరతితో ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్‌ను ఏర్పాటు చేసి ఉచిత భోజనం ఏప్రిల్ 20 నుంచి ప్రారంభించారు. ఆసుపత్రికి విచ్చేసి వివిధ ఆరోగ్య సమస్యల ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వారు అదే విధంగా మారుమూల గ్రామం నుంచి పట్టణంకి వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకులకు, వివిధ పనులకు వచ్చే నియోజకవర్గ ప్రజలకు అన్నదానం సద్వినియోగం చేసుకున్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని మున్సిపాలిటీ కేంద్రంలో ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ ఉచిత భోజనం కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆర్డిటి ఆసుపత్రి వద్ద నేటికీ 168 రోజు ఎర్రంపల్లి మాగం ఈరన్న, దురదకుంట డ్రైవర్ శ్రీరాములు, పాపంపల్లి మంజు, ఎన్‌టిఆర్ అన్న క్యాంటీన్ ఉచిత భోజనం వడ్డించారు. అదే విధంగా పార్టీ కార్యాలయం దగ్గర పట్టణ చంద్రశేఖర్, వన్నూరుస్వామి, భోజనం వడ్డించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 1 గంటలకు అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నారు.

# వైకుంఠ రథానికి విరాళం అందజేసిన నజీరుద్దిన్

**గోరంట్ల, నవంబర్ 8 ప్రభాతవార్త :**



విరాళం మొత్తాన్ని అందచేస్తున్న నజీరుద్దిన్

మేజర్ పంచాయతీ పరిధిలో మృతి చెందిన వారిని స్మశానవాటికకు తరలించేందుకు సులువుగా వుండేందుకు వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేయాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో సర్పంచ్ నరోజానాగేనాయక్, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సహాయం చేయాలని కోరగా గోరంట్లకు చెందిన వైసిపి నాయకులు హైదర్‌వలి కుమారుడు నజీరుద్దిన్ తనవంతు సాయంగా మంగళవారం 10,116 రూపాయల విరాళాన్ని అందచేశారని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. అదేవిధంగా దాతలు సహాయ సహకారాలు అందించి వైకుంఠ రథానికి విరాళం అందచేయాలని కోరారు. వైకుంఠ రథానికి నజీరుద్దిన్ విరాళం అందచేయడం పట్ల పంచాయతీ అధికారులు అభినందనలు తెలిపారు.

# జె.సి.ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలి

-నల్లబ్యాడ్జీలు ధరించి తహశీల్దార్, సిబ్బంది నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్య సిబ్బంది

**ఉవరకొండ, నవంబర్ 8 ప్రభాతవార్త :**

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మెన్ జె.సి.ప్రభాకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికు వెంటనే క్షమాపణ చెప్పాలని తహశీ ల్దార్ ఎస్.బ్రహ్మయ్య సిబ్బంది డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన స్పందన కార్యక్రమంలో సజ్జలదిన్నె భూముల విషయమై జె.సి.ప్రభాకర్‌రెడ్డి వినతిపత్రం అందించడానికి వచ్చి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అయిన కలెక్టర్‌తో దురుసుగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఆయన వ్యవహరించిన తీరు తమను తీవ్రంగా బాధ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు చంద్రశేఖర్, మంజుల, సర్వేయర్ రత్నాకర్, కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

# ఆసక్తికరంగా కొనసాగిన యువతీ యువకుల కబడ్డీ పోటీలు

-ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో నియోజకవర్గ జట్ల ఎంపిక



ఎంపిక చేసిన యువకుల కబడ్డీ జట్టుతో పీడీ, పీఈటీలు

**ఉరవకొండ, నవంబర్ 7 ప్రభాత వార్త :** పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం లో 3 రోజుల పాటు కొనసా గుతున్న గ్రామీణ యువతీ యువకుల క్రీడాపోటీల్లో భాగంగా మంగళవారం కబడ్డీ పోటీలు ఆసక్తిరంగా కొనసాగాయి. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన యువతీ యువకులను నియోజకవర్గ జట్లను ఎంపిక చేశారు. బుధవారం పురుషుల క్రికెట్ పోటీలు జరుగుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వీరన్న, క్రీడా పోటీల నియోజకవర్గం ఇంచార్జ్‌లు పీడీ వై.క్రిష్ణారెడ్డి, పీడీలు సునీత, ప్రసన్నలక్ష్మి, శివప్రసాద్, చంద్ర శేఖర్, రాజేష్, ప్రభాకర్, మారుతీప్రసాద్, శాప్ కోచ్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ పట్ల అభ్యంతర వ్యాఖ్యలు సమంజసం కాదు....

- ఓ ప్రజాప్రతినిధిగా జెసి ప్రభాకర్‌రెడ్డి తీరు తగదు....
- ఆర్‌డిఓ రవీంద్ర, మున్సిపల్ కమీషనర్ బండిశేషన్న, ఎంఆర్‌ఓ బి.రాము తదితరులు.



నిరసన ర్యాలీ సందర్భంగా ప్రసంగిస్తున్న ఆర్‌డిఓ రవీంద్ర, మున్సిపల్ కమీషనర్ బండిశేషన్న, ఎంఆర్‌ఓ బి.రాము తదితరులు.

**గుంతకల్లు, నవంబర్ 08 ప్రభాతవార్త :**

జిల్లా సర్వోన్నత న్యాయా ధికారి (కలెక్టర్) పట్ల దురుసుగా అభ్యంతర వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని, తాడిపత్రి పట్టణ పరిధిలో ఓ ప్రజాప్రతినిధిగా జె.సి. ప్రభాకర్‌రెడ్డి అనుచిత వైఖరి తీరు తగదని ఆర్‌డిఓ రవీంద్ర, మునిసిపల్ కమీషనర్ బండిశేషన్న, ఎంఆర్‌ఓ బి.రాము తదితర అధికారుల బృందం అన్నారు. మంగళవారం గుంతకల్లు పురపాలక సంఘం, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల అధికారులు, సిబ్బందితో మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంగా పట్టణ ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ చేపట్టారు. సదరు కార్యక్రమంకు మున్సిపల్ కమీషనర్ అధ్యక్షతన ఆయా అధికారులతో పాటు పలు సచివాలయాల సిబ్బందితో నిరసన కార్యక్రమంలో భాగంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నుండి పొట్టిశ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీగా సాగించి మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న " స్పందన " కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మెన్ జె.సి.ప్రభాకర్‌రెడ్డి ప్రవర్తనాతీరులో ఓ జిల్లా సర్వతోన్నత న్యాయాధికారిగా ఓ మహిళ అధికారి పట్ల దురుసుగా అభ్యంతకర వ్యాఖ్యలు చేయడం హేయంగా ఉందన్నారు. తాము ఉద్యోగులుగా నిబద్ధతతో భాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం పట్ల విధేయతగా ప్రజలకు సేవలను అందిస్తున్న విషయాన్ని విస్మరించడం ఆయన భాధ్యతారాహిత్యంకు నిదర్శన ంగా ఉందన్నారు. ఇలా అధికారుల పట్ల ఆయన అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని హితవు చెప్పారు. జరిగిన సంఘటన భాధాకరమన్న సత్యాన్ని గుర్తించి ఆయన తక్షణం కలెక్టర్‌కు క్షమాపణలు కోరాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయన తీరుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా సదరు ర్యాలీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పలు విమర్శలకు తావివ్వడం గమనార్హం. సదరు అధికారులు చేపట్టిన నిరసన కార్యక్రమం ర్యాలీ ప్రారంభం కూతవేటు దూరంలో ఉన్న దేశ నాయకుడు గాంధీజీ విగ్రహం వద్ద నుండి కాకుండా కేవలం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడలి నుండి ర్యాలీ ప్రారంభించడం ఏంటన్న విమర్శలుగా వారి ర్యాలీ కార్యక్రమం " స్వామి భక్తి పరాయణంకు " తార్కాణంగా నిలిచిందన్న ఆరోపణలు పట్టణంలో గుసగుసలుగా వినిపించడం గమనార్హం.

# ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామన్నారు ఎక్కడ : సిపిఐ నేతలు



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

**కణేకల్లు, నవంబర్ 8 ప్రభాతవార్త :**

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా ఇచ్చి విభజన చట్టంలోని హామీలను అమలు చేస్తామని ప్రతిప క్షంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చిన నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తానని చెప్పి ఇంత వరకు రాజధానినిర్మాణం కూడా పూర్తి కాలేదు. రాజధాని ఏదో కూడా అర్థం కాని పరిస్థితి. జాతీయ హోదా కలిగినటువంటి పోలవరం ప్రాజెక్టు ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. రెండు సార్లు అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు అయినప్పటికీ ప్రత్యేక హోదా లేదు. విభజన చట్టంలోని హామీల అమలు లేదు. ఇంత వరకు సరైన ప్యాకేజీ కూడా లేదు. రాష్ట్రం మొత్తం అప్పుల మయం. కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు నామమాత్రం. నేటి వరకు అభివద్ధికి నోచుకోని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం ఎంతైనా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధాని ఇప్పటికైనా స్పందించి మీరు విశాఖ వస్తున్నారు. కాబట్టి ఈ పర్యటనలో కచ్చితంగా ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇచ్చి అన్న మాట నిలబెట్టుకోవాలి. విభజన చట్టంలోహా మీలన్నీ అమలు చేయాలి. ప్రత్యేక హోదా పొందిన సిక్కిం, నాగాలాండ్, అరుణాచరల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ము కశ్మీర్ అస్సాం, హిమాచల్ ప్రదేశ్, మేఘాలయ ఇలా 11 రాష్ట్రాలు ఎంతో అభివృద్ధి చెందాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు అన్ని పార్టీల వారు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ప్రత్యేక హోదాపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీని గట్టిగా నిలదీయాలి. అప్పుడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం జరుగుతుంది. ప్రదాని స్పష్టమైన హామీ ఇవ్వాల్సిందే. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నాగార్జున, కణేకల్లు మండల కార్యదర్శి గౌస్, సుహేల్, మాబాషా, సిపిఐ పట్టణ కార్యదర్శి నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

## -డిఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.వి.కృష్ణారెడ్డి

**శ్రీసత్యసాయి జిల్లా(వైద్యం), నవంబర్ 08, ప్రభాతవార్త**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల నీరు నిలువ ఉండడంతో దోమలు, అపరిశుభ్రత నెలకొంటుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉందని, వాటిపై జిల్లా వ్యాప్తంగా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని శ్రీసత్యసాయి జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.వి.కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ముఖ్యంగా వీధులలో నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, వాటిపై ఎక్కువగా దృష్టిసారిస్తూ గ్రామాలలో వైద్యాధికారులు పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాలు వచ్చిన వెంటనే సంబంధిత వైద్యాధికారులను, వైద్యసిబ్బందిని సంప్రదించి మెరుగైన వైద్యసేవలు పొందాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయ ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటా సర్వే చేసి గ్రామాలు, వార్డులలో ప్రబలిన విషజ్వరాలపై సరైన నివేదికను ఎప్పటికప్పుడు అందించాలని ఆయన సూచించారు.

# కొక్కొరోకో.....కో కోడి కూత కూయంగానే కదిరిలో తెరుచుకున్న బార్

- ఉదయం 7 గంటలకే క్యూ కట్టిన మందుబాబులు
- బార్‌అండ్‌రెస్టారెంట్‌లో జోరుగా మద్యం విక్రయాలు
- కోట్లాది రూపాయలు గుమ్మరించాం ఏ సమయంలోనైనా బార్ తెరుస్తాం





అంబేద్కర్ కూడలిలో ఉన్న బార్‌అండ్‌రెస్టారెంట్



ఉదయం 7 గంటలకే బార్‌లో మద్యం విక్రయాలు

**కదిరి టౌన్, నవంబర్ 8, ప్రభాతవార్త :**

కొక్కొరోకో....కో అనే కోడి కూత కూయంగానే కదిరిలో ఓ బార్ అండ్ రెస్టారెంట్ తలుపులు తెరుచుకుంటున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత 3 నెలలుగా కోడి కూత మొదలెట్టగానే బార్ తలుపులు తెరుస్తుండడంతో ఉదయం 7 గంటలకే మందు బాబులు క్యూ కడుతూ మద్యాన్ని పూటుగా సేవించి తుళ్లుతూ, తూలుతూ రోడ్లపై జోగుతున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తమ మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లాలన్న తలంపుతో బార్ యజమాని జోరుగా మద్యం విక్రయాలను కొనసాగిస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వేళాపాల లేకుండా బార్‌ను తెరచి మద్యాన్ని విక్రయించడమే కాక ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ నిర్ణయించి వేళల్లో అమ్మకుండా ఇష్టాను సారంగా సదరు బార్ యజమాని వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ప్రభుత్వం విధించి, నిర్ణయించిన సమయాల్లో అంటే బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉదయం 10 గంటల నుండి రాత్రి 11 గంటల వరకూ మాత్రమే మద్యం విక్రయాలు, రెస్టారెంట్‌లను నిర్వహించాల్సి ఉంటుంది. ఆ మేరకు ఆ విదంగా రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కట్టుబడి బార్ అండ్ రెస్టారెంట్‌ల యజమానులు పనిచేయాల్సి ఉంటుంది. అయితే అందుకు విరుద్ధంగాను, కదిరి ఎక్సైజ్‌శాఖ అధికారుల ఆదేశాలను దిక్కరించి ఓ బార్‌అండ్ రెస్టారెంట్ యజమాని ఉదయం 7 గంటలకే బార్ తెరచి మద్యం ప్రియులను మద్యానికి మరింత బానిసలుగా తయారు చేస్తున్నట్లు ప్రజాహితం కోరే పలువురు వాపోతున్నారు. మరీ ముఖ్యంగా రాత్రి 11 గంటల వరకూ బార్‌లోనే తప్పతాగి ఇంటికి వెళ్లి ఫుల్‌గా నిద్రపోకుండా ఉదయం 7 గంటలకే బార్‌తెరుస్తారని ప్రతి నిత్యం బార్ ఆనవాయితీ కనిపెట్టిన మద్యం ప్రియులు గంట కొట్టినట్లు ఠంచన్‌గా బార్ ముందు క్యూ కడుతున్నారు. హ్యాంగ్‌ఓవర్ పెగ్ పేరిట కొంత మంది ఉన్నత వర్గాలకు చెందిన వారు సైతం బార్‌కు వస్తున్నారంటే సదరు బార్ యజమానులు ఏ మేరకు వారికి తమ సేవలు అందిస్తున్నారో అర్థం చేసుకోవచ్చునని పలువురు సమాజ సేవకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ప్రభుత్వ బాలికల పాఠశాల మరియు కళాశాల ఈ బార్‌కు అతిసమీపంలో ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ బార్ నిర్వహించుకోవడానికి అనుమతిని ఎలా ఇచ్చారోనని పలువురు విద్యార్థినిల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇదిఇలా ఉండగా బార్ అండ్ రెస్టారెంట్‌లలో ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల మేరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం బాబులు మద్యాన్ని కొనుగోలు చేసి అక్కడే తాగాల్సి ఉంటుంది. అయితే అందుకు విరుద్ధంగా సదరు బార్ యజమానులు క్వార్టర్, ఆఫ్, ఫుల్ బాటిళ్లను బయటకు తీసుకువెళ్లేలా విక్రయాలను కొనసాగిస్తుండడం కొసమెరుపు. మద్యం కొనుగోలు చేసిన పిమ్మట బార్‌లోనే మద్యాన్ని సేవించాల్సి ఉంది. అంతే కాక ఒక పెగ్గు, రెండు పెగ్గులు కూడా బార్‌లో అమ్మడానికి వెసలుబాటు ప్రభుత్వం కల్పించింది. కొనుగోలు చేసిన మద్యాన్ని బాటిళ్లను బయటికి తీసుకువెళ్లడానికి ఎలాంటి అనుమతి లేదని కదిరి ఎక్సైజ్ శాఖ సిఐ నరసింహులు వెల్లడించారు. అంతే కాక ఉదయం 7 గంటలకు బార్ తెరిచిన విషయంపై ప్రభాతవార్త సంప్రదించగా అలా వేళా పాల లేకుండా బార్ తలుపులు తెరవడానికి తాము అనుమతులు ఇవ్వలేదన్నారు. అట్టి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుని నోటీసులు జారీ చేసి బార్‌ను సీజ్ చేస్తామని సిఐ స్పష్టం చేశారు.

## లేని భూమిని చూపి డబ్బులు తీసుకున్నారు.. న్యాయం చేయండి మహాప్రభో..!

### - పోలీసులను వేడుకున్న బాధితుడు

**బత్తలపల్లి, నవంబర్ 8 ప్రభాతవార్త :** లేని భూమికి పట్టాధారు పాసు పుస్తకం చూపించి డబ్బులు తీసుకున్నారు, నా డబ్బులు నాకు ఇప్పించండి మహప్రభో అంటూ బాధితుడు బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాధుచేశాడు. మంగళవారం ఎస్ఐ శ్రీహర్ష తెలిపిన వివరాల మేరకు ధర్మవరం పట్టణం గీతానగర్‌కు చెందిన రాజశేఖర్ ఏసి మెకానిక్‌గా పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. రాజశేఖర్‌కు నెత్తివారంపల్లికి చెందిన ఏకిల మల్లేషునాయుడు అనే వ్యక్తి తన తల్లి నాగేశ్వరమ్మ పేరిట 5/1సి సర్వే నెంబరులో 3.22ఎకరాల భూమి వుంది డబ్బులు అవసరముండి అమ్ముతున్నానని పట్టాధారు పాసుపుస్తకం చూపించినట్లు తెలిపాడన్నారు. దానిని నమ్మి మధ్యవర్తులైన కానగల వెంకటేషు, బుక్కపట్నం శ్రీనివాసులు, శింగరాయని క్రిష్ణమూర్తిల సమక్షంలో ధర్మవరం రిజిష్టర్ ఆఫీసు దగ్గర రూ. 5,3100లు డబ్బులు ముట్టజెప్పాడు. ఇందుకు సంబంధించి మల్లేషు నాయుడి తల్లి నాగేశ్వరమ్మ పేరు మీద అగ్రిమెంటు రాసి ఇచ్చాడన్నారు. అప్పటి నుండి రిజిస్ట్రేషన్ చేయించమంటే రేపు నెల, వచ్చే నెల అంటూ చెబుతున్నాడే కాని రిజిస్ట్రేషన్ చేయించలేదన్నారు. అనుమానం వచ్చి తహశీల్దార్ కార్యాలయంలో చూడగా 1బిలో మల్లేషునాయుడి తల్లి పేరు వుందని అడంగల్‌లో మరొకరి పేర వుందని తెలిసిందన్నారు. మల్లేషునాయుడి తల్లి పేరు మీద వున్నది ఫేక్ పాసుపుస్తకమని తేలిందన్నారు. దీంతో తాను మోసపోయానని నా డబ్బులు నాకు ఇప్పించండని ఫిర్యాధు చేసినట్లు తెలిపారు. భాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## సవితకు పరామర్శల వెల్లువ

### - మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నాయకులు అండ


సవితను పరామర్శిస్తున్న టిడిపి నేతలు

పెనుకొండ, నవంబర్ 8 ప్రభాత వార్త : తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కారర్యనిర్వహక కార్యదర్శి సవిత మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పరామర్శలు విలువలు వెల్లువెత్తుతున్నాయి. సవిత భర్త వెంకటేశ్వరరావుపై సిబిఐ కేసు నమోదు చేసి గత ఐదు రోజులక్రితం పెనుకొండలోని సవిత స్వగృహంలో సిబిఐ సోదాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రులు పరిటాల సునీత పల్లె రఘునాథరెడ్డిలు సవితకు ధైర్యం నింపి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా జిల్లాలోని తెలుగు దేశం పార్టీ నాయకులు కురువ సంఘం నాయకులు సవిత స్వగృహానికి వచ్చి ఆమెకు అండగాఉంటామని ధైర్యం నింపుతున్నారు. వర్గం పరిధిలోని గోరంట్ల పరిగి రొద్దం, సోమందేపల్లి, పెనుకొండ, మండలాల నుంచి తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు ప్రతిరోజు సవిత స్వగృమానికి వచ్చి ఆమెను పరామర్శిస్తున్నారు. సిబిఐ సోదాల నేపథ్యంలో ఆమెను రాజకీయంగా ఆర్థికంగా అణగదొక్కాలని అధికార పార్టీ నాయకులు చూస్తున్నారని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఆమెపై కేసులు నమోదు చేసి సంఘటనలు చోటు చేసుకున్నాయి. సవితను పరామర్శించడానికి వచ్చే నాయకులు, కార్యకర్తలకు ఆమె రుణపడి ఉంటానని పేర్కొంటున్నారు.

## పోస్టల్ ఖాతాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోస్టల్ శాఖ మేనేజర్

**అగళి, నవంబర్ 8 ప్రభాతవార్త :** అగళి కెజిఎ గుప్తా కళాశాలలో పోస్టల్ సేవింగ్స్ ఖాతాపై పోస్టల్ శాఖ మేనేజర్ గణేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఖాతా తెరవడం ఎలాగ, అందులో ఏ విధంగా పొదుపు చేయాలి, ఫిక్డ్స్ డిపాజిట్లకు ఎంత వడ్డీ అన్న విషయాలపై ఖాతాల్లో ఎలాంటి మోసాలు లేకుండా, ఎలాంటిమెలుకువలు తీసుకోవాలి అన్న దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఘురామ్, ఉప ప్రిన్సిపాల్ రఘు, అధ్యాపకులు ఉన్నారు.

## ఇసుక ఇక్కట్లను తీర్చండి

**అగళి, నవంబర్ 8 ప్రభాతవార్త :** సువర్ణముఖి నదిలో ప్రస్తుతం ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవడంతోపాటు రెండు నెలలుగా సువర్ణముఖి నది ఏకధాటిగాపారడం మూలంగా సువర్ణముఖి నదిలో ఇసుక సంవృద్ధిగా ఉంది కానీ ప్రజలకు మాత్రం ఇసుక ఇక్కట్లు తీరడం లేదు. ప్రభుత్వం మైన్స్ అండ్ జియాలజీ వారు ఇసుక రీచ్‌లను గుర్తించి ఇండెంట్లకు అనుమతిస్తే ఇల్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు, సిమెంట్‌రోడ్లు, కమ్యునిటీ భవనాలు, ప్రభుత్వ భవన నిర్మాణానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇసుక లేని కారణంగా నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మండల కేంద్రంలోనే వందలాదిమందికి మరుగుదొడ్ల సౌకర్యం లేక ఆరు బయట మల విసర్జనకు పోవాల్సిన పరిస్థితి ఉంది. మండల వ్యాప్తంగా దీని ప్రభావం ఉంది. మండలంలో నేటికీ 50 శాతం మంది మరుగుదొడ్లు లేక ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా పర్యవరణం దెబ్బతింటోంది. ఇల్లు నిర్మించుకోవాలన్నా, మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నా ఇసుక తప్పనిసరి, ఇక భవనాల కంచికి. నిర్మాణాలు ఆగిపోవడం వల్ల కూలీలు, భవన నిర్మాణ కార్మికులకు, టింబర్ పనివారు, కార్పెంటర్లు, విద్యుత్ పనులు చేసే వారు భవన నిర్మాణానికి రకరకాల కూలీలు అవసరం ఉంటుంది. ఇసుక లేని కారణంగా వాటి నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి భవన నిర్మాణాలకు ఎన్ని రకాల కూలీలు అవసరమో వారికి ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. కావున కలెక్టర్ చొరవ తీసుకుని కనీసం పేదలు చిన్న ఇల్లు నిర్మించుకోవడానికి, మరుగుదొడ్ల నిర్మించుకోవడానికైనా ఇసుక రీచ్‌లను గుర్తించి అనుమతి ఇస్తే.. ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండల ప్రజలు అంటున్నారు.

## అగ్రవర్ణాలకు రిజర్వేషన్ కల్పించడం హర్షదాయకం

**అగళి, నవంబర్ 8 ప్రభాతవార్త :** అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడం హర్షదాయకమని బిజెపి నాయకులు వీర చిక్కప్ప, అశోక్ తదితరులు అన్నారు. అగ్రవర్ణంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇవి ఎంతో ఉపయోగకరమని, దీని కోసం భారతీయ జనతాపార్టీ పోరాడిందని, ఆ పోరాట ఫలితమే సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పుకు నిదర్శనమన్నారు. అదే విధంగాకాపు బలిజలకు ఆంధ్రప్రదేశ్‌లో 5 శాతం రిజర్వేషన్‌ను కేటాయించాలని బిజెపి సీనియర్ నాయకులు వీర చిక్కప్ప, అశోక్ తదితరులు డిమాండ్ చేశారు. గతంలో 5 శాతం రిజర్వేషన్ ఇస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించినా ప్రస్తుత ప్రభుత్వం దానిని రద్దు చేసిందని, ఇప్పుడు సుప్రీం కోర్టు అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్‌ను వర్తింప చేసిందని దానిని ఆంధ్రప్రదేశ్‌లో కాపు బలిజలకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

## పీఏబీఆర్ పైప్‌లైన్‌కు కొనసాగుతున్న మరమ్మతులు

### -నేటి సాయంత్రానికి నీటి పంపింగ్ పునరుద్దరిస్తామన్న డీఈఈ


పగిలిన పీఏబీఆర్ తాగునీటి పథకం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

**ఉరవకొండ, నవంబర్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాకెట్ల గ్రామంవద్ద పగిలిన పీఏబీఆర్ తాగునీటి పైప్‌లైన్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ అధికారులు చేపట్టిన మరమ్మతులు మంగళవారం చీకటిపడే వరకు కొనసాగాయి. పైప్‌లైన్ పగిలిపోయి పీఏబీఆర్ నుండి ఉరవకొండకు తాగునీటి సరఫరా అగిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అంజుమన్ సబ్రీన్, ఏఈఈ ఫమీదా బృందం కార్మికులతో పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పనులు బుధవారం సాయంత్రానికి పూర్తి అవుతాయని ఆ తరువాత పట్టణానికి డ్యాం నుండి నీటి పంపింగ్‌ను పునరుద్దరిస్తామన్నారు.

## ఈడబ్ల్యూఎస్‌పై సుప్రీ కోర్టు తీర్పు చారిత్రాత్మకం

### - ఎపి రెడ్డి సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నితిన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎపి రెడ్డి సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నితిన్‌రెడ్డి

**మడకశిర టౌన్, నవంబర్ 8 ప్రభాత వార్త :** ఆర్థికంగా వెనుకబడిన అగ్రకుల పేదల (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లను తొలగించేందుకు వీలు కాదని దాన్ని కొనసాగించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నితిన్‌రెడ్డి పేర్కొన్నారు. 2019లో కేంద్ర ప్రభుత్వం 103 రాజ్యాంగ సవరణ ద్వారా అగ్రవర్ణ పేదల కోసం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ప్రవేశ పెట్టిందని దీని వ్యతిరేకిస్తూ కొంత మంది సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు ఈ తీర్పు నివ్వడం హర్షించ దగ్గ పరిణామమని పేర్కొన్నారు. రిజర్వేషన్లు ఏ సామాజిక వర్గానికి వ్యతిరేకం కాదని ఇతర వర్గాల రిజర్వేషన్లకు నష్టం కలగకుండా ఆనందంగా సీట్లు ఉద్యోగాలు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడమే దీని ఉద్దేశ్యమని తెలిపారు. గతంలో ఎన్డీఏ యూపిఏ ప్రభుత్వాలు అగ్రవర్ణ పేదల స్థితిగతులపై ఏర్పాటు చేసిన మేజర్ జనరల్ కమిషన్ పార్లమెంట్‌కు నివేదిక ఆధారంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించినట్లు నితిన్‌రెడ్డి వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఆరు కోట్ల మందికి పైగా అగ్రవర్ణ పేదలు ఉన్నారని వీరిని ఓబిసి జాబితాలో చేర్చి విద్య ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించాలని మేజర్ కమిషన్ పార్లమెంట్‌కు నివేదిక సమర్పించిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పుతో లక్షలాది మంది అగ్రవర్ణ పేదలు, విద్య వైద్యాలలో లబ్ది పొందే అవకాశాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు.

## డిఐఓ ఆకస్మిక తనిఖీ


పిహెచ్‌సిలో రికార్డులు పరిశీలిస్తున్న డి.ఐ.ఓ

**సోమందేపల్లి, నవంబర్ 8 ప్రభాత వార్త :** సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.కృష్ణయ్య మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులను, రిపోర్టులను, వ్యాక్సిన్ శీతలీకరణ విధానాన్ని, డ్రగ్ స్టోర్లను పరిశీలించి పలు సూచనలు అందించారు. సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. అనంతరం కేతగాని చెరువు సచివాలయం వద్ద 104 ద్వారా జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించి ఓపి, మందులు, పరీక్షలు, కంప్యూటీకరణ మొదలగు విషయాలపై డా.నరేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత, ఎన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆయన వెంట, జిల్లా జూనియర్ అసిస్టెంట్ బాబాఫకృద్దీన్, డా.హరికుమార్, సిహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, మధుబాబు, ఆరోగ్య పర్యవేక్షకులు రవీంద్ర, సుబ్బయ్య, నారాయణమ్మ, రత్నమ్మ, ఎల్‌పి. అనీల్‌లు పాల్గొన్నారు.

## మిరపలో నల్లతామర పురుగు నివారణకు చర్యలు చేపట్టండి

### - రైతులకు సూచించిన జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి

వార్త ప్రభావం


తెగుళ్లు సోకిన మిరప పంటను పరిశీలిస్తున్న అధికారులు

**ఉరవకొండ, నవంబర్ 8 ప్రభాతవార్త :** మిరప పంటలో నల్ల తామర పురుగు కనిపిస్తోందని ఆలస్యం చేయకుండా వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి రైతులకు సూచించారు. 'వార్త'లో ఈనెల 7వ తేదిన 'విల్ట్ తెగులుతో కుదేలవుతున్న మిరప రైతు..!' అన్న శీర్షిక ప్రత్యేక కధనం వెలువడటంతో జిల్లా అధికారులు స్పందించారు.


డ్రిప్, స్ప్రింక్లర్ల కంపెనీ ప్రతినిధులు, ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలిస్తున్న అధికారులు

మంగళవారం జిల్లా ఉద్యాన అధికారి ఏపీయంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఫిరోజ్‌ఖాన్, డివిజినల్ ఉద్యాన అధికారి నెట్టి కంఠయ్య సిబ్బందితో కలిసి ఉరవకొండ మండలం లత్తవరం, వజ్రకరూరు మండలం ఛాయాపురం, చిన్నహోతూరు గ్రామాల్లో తెగుళ్ల సోకిన మిరప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి మాట్లాడుతూ నల్ల తామర పురుగుల నివారణకు నీలి లేదా తెలుపు రంగు అట్టలను ఎకరాకు 30 నుంచి 40 వరకు పెట్టుకోవాలన్నారు. వేప నూనె 1000పీపీఎంను 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటితో కలిపి పంటపై పిచికారి చేసుకోవాలని, జీవ సిలీంద్ర నాశనులు బవేరియా, వర్టిసిల్లీయంను 5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.

**డ్రిప్, స్ప్రింక్లర్లకోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్న ఏపీఎంఐపీ పీడీ :** రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏపీయంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఫిరోజ్‌ఖాన్ సూచించారు. జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డితో కలసి మిరప పంట పరిశీలన అనంతరం ఆయన పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్రిప్, స్ప్రింక్లర్ కంపెనీల ప్రతినిధులు, ఆర్‌బీకేల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కమ్యూనిటీ లిఫ్ట్ అండ్ డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు అనుమతులు వచ్చాయన్నారు. 23 గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా వారికి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజినల్ ఉద్యాన అధికారి నెట్టికంఠయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెగులు సోకిన 3 ఎకరాల మిరప పంట తొలగింపు

### -పెట్టుబడి, దిగుబడిని నష్టపోవాల్సి వచ్చిందంటున్న రైతు


పంటను దున్నేస్తున్న రైతు కురుబ మల్లికార్జున దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నెరమెట్ల గ్రామానికి చెందిన కురుబ మల్లికార్జున అనే రైతు మంగళవారం తాను సాగు చేయగా నల్లి తెగులు సోకిన 3 ఎకరాల మిరప పంటను ట్రాక్టర్ రోటోవేటర్‌తో తొలగించారు. తాను 10 ఎకరాల్లో మిరప సాగు చేయగా ఇటీవలి కాలంలో కురిసిన భారీ వర్షాలకు 70 రోజుల వయసుగల పంటకు నల్లి తెగులు ఆశించిందని ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకపోవడంతో పంటను తొలగించుకోవాల్సి వచ్చిందని రైతు మల్లికార్జున విలేఖరులకు తెలిపారు. మిగిలిన 7 ఎకరాల్లో కూడా పంట నిలిచే పరిస్థితి లేదన్నారు. ఎకరాకు 30వేల రూపాయలు గుత్తకు పొలం తీసుకొని 60వేల రూపాయలు పెట్టుబడిపెట్టి పంటను సాగు చేయగా తెగులు కారణంగా పూర్తిగా దెబ్బతిందన్నారు. దీంతో తనకు పెట్టుబడి 10 లక్షల రూపాయలతోపాటు దిగుబడి మరో 25 లక్షల రూపాయలను కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

## కలెక్టర్‌పట్ల జె.సి.ప్రభాకర్‌రెడ్డి వ్యవహరించిన తీరు గర్హనీయం

### -క్షమాపణ చెప్పాలన్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



**ఉరవకొండ, నవంబర్ 8 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిపట్ల తాడిపత్రి మున్సిపల్ ఛైర్మెన్ జె.పి.ప్రభాకర్‌రెడ్డి వ్యవహరించిన తీరు గర్హనీయమని ఎమ్మెల్సీ వై.శివ రామిరెడ్డి ఖండించారు. మంగళ వారం ఆయన స్థానిక విలేఖరుల తో మాట్లాడుతూ జె.సి.ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్‌తో మాట్లాడిన తీరు, ప్రవర్తించిన విధానం క్షమించరానిదని ఆయన మాటలు వెనక్కు తీసుకొని కలెక్టర్‌కు వెంటనే క్షమాపణ చెప్పి తన గౌరవాన్ని కాపాడుకోవాలన్నారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా జిల్లా అధికారులు తమ శక్తివంచన లేకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అలాంటివారిపట్ల కృతజ్ఞత చూపకపోయినా పర్వాలేదుగాని అనుచితంగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. సమస్యలు ఇక్కడ పరిష్కార కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలిగాని అధికారులను తమ చెప్పుచేతుల్లో పెట్టుకోవాలన్నట్లు వ్యవహరించడం దుర్మార్గమైందన్నారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తన పనితీరుతో అతనికాలంలోనే జిల్లా ప్రజల మన్ననలు పొందారని అలాంటి కలెక్టర్‌పట్ల ఇలాంటి ప్రవర్తన ఆక్షేమనీయమన్నారు. ఇటీవలి కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా కూడా టీడీపీ పార్టీ నాయకులు కొందరు అధికారులను బెదిరించడం, బ్లాక్ మెయిలింగ్ చేయడం అలవాటుగా చేసుకున్నారని టీడీపీ పార్టీ బలహీన పడుతుండటంతోనే నిరాశ నిస్పృహలతో ఇలా వ్యవహరిస్తున్నారని వై.శివరామిరెడ్డి ఎద్దేవా చేశారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ ఈశ్వరమ్మ అమ్మవారి మాలధారణ

### -వైభవంగా కొనసాగిన ఉత్సవమూర్తి ఊరేగింపు


శ్రీ ఈశ్వరమ్మ అమ్మవారి ఉత్సవమూర్తితో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 8 ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీ ఈశ్వరమ్మ ఆలయంలో స్వస్తిశ్రీ శుభకృత్‌నామ సంవత్సరం కార్తీక పౌర్ణమి మంగళవారం అమ్మవారి మాలదారణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఉదయం అమ్మవారి మూలవిరాట్, శ్రీ సద్గురు శాంతానంద రంగయ్యస్వామి విగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించిన గురుస్వాములు దీక్ష చేపడుతున్న భక్తులకు మాలదారణ గావించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తితో మాలదారులు ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మాలదారణ కార్యక్రమానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

## కార్మికులతో ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ ఎస్ఈ జరిపిన చర్చలు విఫలం

### -రాతపూర్వక హామీ ఇచ్చేంతవరకు సమ్మె కొనసాగిస్తామన్న నాయకులు


చర్చలకు హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ ఎస్ఈ హేసాన్‌బాషా, డీఈఈ రామారావు తదితరులు

**ఉరవకొండ, నవంబర్ 8 ప్రభాతవార్త :** ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ ఎస్ఈ హేసాన్ బాషా, డీఈఈ రామారావుతో శ్రీ తస్యసాయి మంచి నీటి సరఫరా కార్మికులు మంగళవారం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. రాతపూర్వక హామీ ఇచ్చేంతవరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధనకై కార్మికులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌వద్ద ఆందోళన చేసిన నేపథ్యంలో ఉదయం సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆర్‌డబ్ల్యూ ఎస్ఎస్ ఎస్ఈ హేసాన్‌బాషా, డీఈఈ రామారావు సీఐటీయు రాష్ట్ర నాయకులు, కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.ఓబులు, అధ్యక్షుడు హెచ్.తిప్పేస్వామి, కార్యదర్శి మహబూబ్‌బాషా, కోశాధికారి శ్రీరాములు తదితరులతో చర్చించారు. వారు చేసిన ప్రతిపాదనలను ఆమోదించని కార్మికులు సమ్మె కొనసాగించాలని నిర్ణయించారు. కార్మికులు మాట్లాడుతూ 1998 ఏప్రిల్ నుంచి 2021 జూన్ వరకు ఎల్అండ్‌టీ ఇవ్వాల్సి గ్రాట్యూటీ వెంటనే చెల్లించాలన్నారు. ఎల్అండ్‌టీ సంస్థ కార్మికులకు ఇస్తున్న గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, బోనస్ కొనసాగించాలని, సంస్థలో పని చేసి చనిపోయిన కార్మికులకు, రిటైర్ అయిన కార్మికులకు వెంటనే గ్రాట్యూటీ చెల్లించాలని, 2021 తరువాత చనిపోయినవారికి, గ్రాట్యూటీ మొత్తం కార్మికులు 19 మందికి ఇవ్వాలని, మిగిలిన వారికి సర్వీసు కంటిన్యూచేసి రిటైర్ అయినపుడు, చనిపోయినపుడు గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐలో తప్పులు సవరించాలని, వేతన సవరణ జరుపాలని, బోర్డు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## చంద్రగ్రహణం సందర్భంగా శ్రీవారి ఆలయం మూసివేత

### -నేటి ఉదయం 6 గంటలకు తెరుచుకోనున్న ఆలయం


ఆలయాన్ని మూసివేస్తున్న దృశ్యం

**ఉరవకొండ, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** చంద్ర గ్రహణం సందర్భంగా మంగళవారం ఉదయం 6 గంటలకు మండల పరిధిలోని పెన్నహోబిళంలోగల ప్రసిద్ధి శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంను మూసివేశారు. శ్రీ లక్ష్మినరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో అర్చకులు గుండుస్వామి, సిబ్బంది ఆలయాన్ని మూసివేసి తాళాలు వేశారు. గ్రహణం అనంతరం బుధవారం ఉదయం 6 గంటలకు ఆలయాన్ని తెరిచి శుద్ధి కార్యక్రమాల అనంతరం శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతించడం జరుగుతుందని ఈ విషయాన్ని భక్తులు గ్రహించాలని ఈఓ కె.విజయ్‌కుమార్ వివరించారు.

## నిరుద్యోగయువత పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి- ఆర్డీఓ రవీంద్ర


నూతన పుస్తకాలను విడుదల చేస్తున్న ఆర్డీఓ రవీంద్ర

**గుంతకల్లు టౌన్, నవంబర్ 8 ప్రభాతవార్త :** పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువత నూతన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ రవీంద్ర అన్నారు. వజ్రకరూరు శాఖ గ్రంథాలయానికి మంజూరైన 371 నూతన పుస్తకాలను ఆర్డీఓ మంగళవారం విడుదల చేశారు. అనంతరం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గ్రంథాలయ అధికారిని మునెమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. గ్రూప్-1, గ్రూప్-2 పోటీపరీక్షలకు పుస్తకాలు దోహదపడతాయన్నారు. విద్యార్థిదశలో అనంతపురం గ్రంథాలయానికివెళ్లి పుస్తకాలు చదివేవాడినని ఆ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. గ్రంథాలయ పాఠకులు, నిరుద్యోగ యువత నూతన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం గ్రంథాలయ అధికారిని మునెమ్మ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఉమామోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని చాలా ఏళ్ల తరువాత పుస్తకాలు మంజూరు చేశారని ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఏ వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ముద్దచర్మవ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి


పశువైద్యాధికారికి వినతిపత్రం అందచేస్తున్న సిపిఐ నాయకులు

**గుంతకల్లు టౌన్, నవంబర్ 8 ప్రభాతవార్త :** పశువుల్లో ముద్దచర్మ వ్యాధి ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్ అన్నారు. మంగళవారం పశువైద్యాధికారి చెన్నయ్యకు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పాడిపశువులపై ఆధారపడి చాలా మంది జీవిస్తున్నారని లంపి, ముద్దచర్మవ్యాధి సోకి పశువులు మృతి చెందుతున్నాయని దీంతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలకు ఈ వ్యాధి సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రం అందచేసిన వారిలో మండల సహాయ కార్యదర్శి రామాంజినేయులు, వ్యవసాయకార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్ర, నాయకులు సురేష్, మురళీకృష్ణ, గురుస్వామి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పట్టు రైతులకు అవగాహన కార్యక్రమం


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**గుడిబండ, నవంబర్ 8 ప్రభాత వార్త :** మండల పరిధిలోని మోరుభాగిలు గ్రామంలో పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టు రైతులకు అధికారులు పట్టు పంటను సంరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సలహాలు సూచనలు అందించారు. తదనంతరం అధికారులు పరిశీలిచారు. ఈ కార్యక్రమంలో ఎడి రాజునాయక్, ఎఎస్ఓ చంద్రమోహన్‌రెడ్డి, టిఓ ముత్తప్ప, విఎస్ఓ నరసింహమూర్తి, నరేష , శంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో సిమెంట్ బస్తాలు



అంగన్‌వాడీ కేంద్రంలో వేసిన సిమెంట్ బస్తాలు

**గుడిబండ, నవంబర్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాళ్లపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రైవేట్ వ్యక్తులు సిమెంట్ బస్తాలు వేసి అంగన్‌వాడీ సిబ్బందికి, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఇబ్బంది కలిగిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలోని వంట చేయు గదిలో సిమెంట్ బస్తాలు వేయడంతో ఉన్న ఒక్క గదిలోనే వంట చేయాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నారులకు విద్యాబోధన చేయాల్సి ఉంటుంది. అందులోనే వంటకు వాడే గ్యాస్, ఇతర పరికరాలు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలిసినా స్పందించడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. స్థానిక నాయకుల అండతో ప్రైవేట్ వ్యక్తులు తమ సొంత అవసరాలకు వాడుకోవడం మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకుని చిన్నారులకు అంగన్‌వాడీ సిబ్బందికి ఏ విధమైన ఆటంకాలు కలగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## చంద్ర గ్రహణం సందర్భంగా మూత పడ్డ సిద్ధేశ్వర ఆలయం


మూత పడ్డ దేవాలయ దృశ్యం

**అమరాపురం, నవంబర్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి హెంజేరు సిద్ధేశ్వర ఆలయం పౌర్ణమి చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి రాత్రి దాకా సిద్ధేశ్వరస్వామి దేవాలయాన్ని మూసి వేసినట్లు ఆలయ అర్చకులు, నాగేంద్రప్రసాద్‌రావు ఆలక కమిటీ ఛైర్మన్ మంజునాథ్‌తెలిపారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనాన్ని కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

## జిల్లా స్థాయి పోటీలకుఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థులు


విద్యార్థులకు అభినందిస్తున్న దృశ్యం

**అమరాపురం నవంబర్ 8 ప్రభాతవార్త :** అమరాపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులు స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుళపతి, పిడి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా అండర్ -14 విభాగంలో కబడ్డీ నందు కె. అక్షర, ఎన్ చంద్రశేఖర్‌లు ఎంపికైనట్లు, అదేవిధంగా అండర్ -17 విభాగంలో వాలీబాల్, 100 మీటర్ల లాంగ్ జంప్‌లో ఎన్. నరేష్ నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంకైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు.

## మరువవంక కట్టడాల తొలగింపుపై గ్రామ సభ


మాట్లాడుతున్న సర్పంచ్

**అమరాపురం, నవంబర్ 8 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన అమరాపురం చెరువు మరువ వంక ప్రాంతంలో అక్రమ కట్టడాల తొలగింపుపై గ్రామ సభను మంగళవారం సర్పంచ్ వాగేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇరిగేషన్ డిఈ. వెంకటరమణ, ఈవోఆర్డీ సుధాకర్, మాజీ జెడ్పిటిసి నరసింహామూర్తి, ఇరిగేషన్ ఏఈ భార్గవ్, వైఎస్ సర్పంచ్ సిద్ధేశ్వర, గ్రామ కార్యదర్శి ఈరన్న తదితరులు పాల్గొన్నారు. ఉన్నతాధికారుల అందిన నివేదికను ఇరిగేషన్ డిఈవెంకటరమణ వివరించారు. సర్పంచ్ వాగేష్ మాట్లాడుతూ గత నలుబై సంవత్సరాల క్రితం ఇల్లు, షాపులు నిరుపేదలు బ్రతుకు తెరువు కోసం నిర్మించుకున్నారన్నారు. మరువ పారడానికి ఆర్అండ్‌బి రోడ్డు పరిధిలో అధికారులు బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తే ఏలాంటి కట్టడాలు తొలగించాల్సిన అవసరం లేదని ఆయన విన్నవించారు. ప్రస్తుతం మరువ నీరు వెళ్లడానికి ఇబ్బంది లేదన్నారు.మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి మాట్లాడుతూ నిరుపేదలకు ప్రభుత్వం చేయూత నివాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్ళు, షాపులు తొలగిస్తే బాధితులు నిరాశ్రయులు అవుతారని తొలగించవద్దని నీరు వెళ్లడానికి బాధితలు సహకరిస్తారన్నారు. ఈసందర్భంగా అధికారులకు బాధిత కుటుంబాల నుంచి నివేదికలు అందజేశారు. ఉన్నతాధికారులు నివేదికలు పంపి ఆపై ఉన్నతాధికారులు ఆదేశాల మేరకుచర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగేంద్ర, దాదాపీర్ తదిరులు పాల్గొన్నారు.

## మారుమూల ప్రాంతాలకు కార్పోరేట్ వైద్యం



బాలింతలకు ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఓ

**తనకల్లు, నవంబర్ 8, ప్రభాతవార్త:**



రికార్డులు పరిశీలిస్తున్న డియంహెచ్ఓ

మండలంలోని సచివాలయం-2 పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని, కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఎస్వి కృష్ణారెడ్డి (డియంహెచ్ఓ) మంగళశారం ఆకస్మిక తనిఖీ చేశారు. మొదటగా తనకల్లు సచివాలయం2 పరిధిలోని బద్దెనాయక్ తండాలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో భాగంగా 104 ద్వారా సేవలందిస్తుండటంతో జిల్లా వైద్యాధికారి అక్కడికి విచ్చేసి తనిఖీ నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో అందుతున్నటువంటి సేవలను గ్రామస్తులును అక్కడికి విచ్చేసిన రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం వల్ల మారుమూల ఉన్నటువంటి గ్రామీణ ప్రాంతాలలో కూడా ఇంటి వద్దనే కార్పోరేట్ వైద్యం అందు తుందన్నారు. బిసి,షుగర్ వంటి దీర్ఘకాలిక జబ్బులను గ్రామాలలనే పరీక్షలు నిర్వహించి చికిత్స చేసి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. వైద్యులు చిరు వ్యాధులకు చికిత్సలతో పాటు మందులు అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను వైద్యులు సందర్శించి జబు ్బతో ఉన్నటువంటి పిల్లలను పరీక్షించి మందులు అందజేశారు. అదేవిధంగా గ్రామంలో మంచంపై ఉన్నటువంటి రోగులను వారి ఇంటి వద్దకే వెళ్ళి ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం అందిస్తారు. ఫా ్యమిలీ ఫిజీషియన్ విధానంలో దాదాపు 67 రకాల మందులు, 14 రకాల పరీక్షలను గ్రామాల్లోని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా వైద్యాధికారి తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పొందుతున్నటువంటి సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా ఆసుపత్రిలో ఉన్న మందులను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎన్‌సిడిసిడి సర్వే, చైల్డ్ హెల్త్ గురించి, గర్భవతులు , బాలింతల వివరాల గురించి వైద్యాధికారిని ఆరా తీశారు. అదే విధంగా చైల్డ్ ఇమ్యునైజేషన్ ఈ ఔషదీగురించి ఆరా తీశారు. ముఖ్యంగా ఎన్‌సిడిసిడి సర్వే వేగవంతం చేయాలని వైద్యాధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటరమణ, శివ నారాయణ, ఏంపి హెచ్ఈఓ ఓబులేసు,సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, ఏఎన్ఎం హసీనా,హెల్త్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## టిడిపి విజయబావుటా ఎగురవేయడానికి సైనికుల్లా పనిచేయాలి

**- టిడిపి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చిన నారాలోకేష్**



నారా లోకేష్‌ను కలిసిన టిడిపి నాయకులు

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 8, ప్రభాతవార్త**

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా అలుపెరగని పోరాటం చేసి తెలుగుదేశం పార్టీ విజయబావుటాను ఎగురవేయడానికి సిద్ధం కావాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాదులోని లోకేష్ నివాసంలో పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గానికి చెందిన సత్యసాయి జిల్లా టిడిపి వడ్డెర సాధికారిత సమితి జిల్లా కన్వీనర్ పల్లపు రవీంద్ర, ఐటిడిపి పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి మంజునాథ్, ధర్మవరం 7వ వార్డు టిడిపి ఇన్‌చార్జ్ పల్లపు శివశంకర, శంకరనారాయణ, టిడిపి యువ నాయకుడు పల్లపు ధనుష్ భార్గవ్, శ్రీనివాసులు, వెంకటరాముడులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌తో టిడిపి నాయకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెల్లడించారు. ఇందులో భాగంగా వైకాపా అధికారంలోకి వచ్చిన పిమ్మట బుక్కపట్నం మండలం రామసాగరం గ్రామంలో తమపై అక్రమంగా బనాయించిన ఎస్సీ, ఎస్టీ కేసులను తమపై బనాయించిన విషయాన్ని వివరించారు. అంతేకాక వడ్డెర సాధికార సమితి నేతృత్వంలో విరివిగా కమిటీల ఏర్పాటుపై వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి కేసులకు, దౌర్జన్యాలకు తలొంచకుండా వైకాపా నాయకులపై ఎదురుదాడి చేస్తున్నందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. తాను సత్యసాయి జిల్లాలో త్వరలో తాను ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహిస్తున్నానని అప్పుడు ఈ కేసుల విషయమై బహిరంగ సమావేశంలో ప్రజలకు వివరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల్లో టిడిపి అధిష్టానం బలపరిచిన అభ్యర్థుల గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని వారిని లోకేష్ కోరారు.

## బళ్లారిలో నూతన 'విస్తార' న్యూస్ ఛానల్‌కు శ్రీకారం



కన్నడ న్యూస్ ఛానల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి. చిత్రంలో రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, ఎన్.ప్రతాపరెడ్డిలు ఉన్నారు.

**బళ్లారి, నవంబర్08, ప్రభాతవార్త**

కర్ణాటక రాష్ట్రంలో నూతన కన్నడ 'విస్తార' ఛానల్ ప్రారంభమయ్యింది. బళ్లారిలో కన్నడ సాహిత్య పరిషత్, పతంజలి యోగా సమితి సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛానల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, జేడీఎస్ పార్టీ నాయకుడు ఎన్.ప్రతాప్‌రెడ్డిలు హాజరయ్యారు. స్థానిక బీడీఏ సభాభవనంలో జరిగిన కార్యక్రమంలో 'విస్తార' కన్నడ న్యూస్ ఛానల్‌ను అధీకృతంగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సండూరు విరక్తమఠం ప్రభుస్వామి ఛానల్ ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ రెండు కన్నడ దినపత్రికల్లో సంపాదకుడిగా పనిచేసి అభివృద్ధికి దోహదపడిన సీనియర్ జర్నలిస్టు హరిప్రకాష్ కోణిమనె ఈ 'విస్తార' న్యూస్ ఛానెల్‌ను ప్రారంభించడం సంతోషదాయకమని, ప్రజాభిమానం ఈ ఛానల్ పొందాలని పేర్కొన్నారు. అనతికాలంలోనే విస్తార న్యూస్ ఛానల్‌కు అశేష ప్రజాదరణ పొందడం గర్వించదగ్గ విషయమని, వార్తా ప్రసారాల చానళ్ల ద్వారా ప్రజలు క్షణాల్లో దేశం, ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలు క్షణాల్లో కళ్ల ముందు చూపించి సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేస్తూ తమ ఘనతను చాటుకుంటున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన విస్తార ఛానల్‌ను ప్రారంభించడం తమకెంతో ఆనందంగా ఉన్నదని చెప్పారు. బళ్లారిలో ఈ ఛానల్ ప్రజల ఆదరణ చూరగొనాలని చెప్పారు. ఇదే సందర్భంలో రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, జేడీఎస్ నాయకుడు ఎన్.ప్రతాపరెడ్డి, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నిష్టి రుద్రప్ప తదితరులు ప్రసంగించారు. విస్తార న్యూస్ ఛానల్ జిల్లా ప్రతినిధి శశిధర్ మేటీ అతిథులకు స్వాగతం పలికారు. వందలాది మంది ప్రజలు ఇదే సందర్భంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ



ఆశా వర్కర్‌లకు అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఓ

**నల్లచెరువు, నవంబర్ 8, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం డిఎంహెచ్ఓ ఎస్వి కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. నాడు నేడు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌లతో మాట్లాడుతూ వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయకపోవడంతో వైద్య సేవలు చేయడానికి వైద్యులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని, కరెంట్ సమస్యలపై వైద్య సమస్యలు ఇబ్బందులకు గురికాకుండా ఇన్వెర్టర్ సహాయంతోనైనా ప్రజల సేవలు అందించాలని తెలియజేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం వైద్య అధికారురి మాట్లాడుతూ గతంలో నాడు నేడు కింద చేసిన పనులు పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌పై ఆశ వర్కర్ కార్యకర్తలకు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దోబిఘాట్లు నిర్మించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రజక సంఘం నాయకులు

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 8, ప్రభాతవార్త**

రజక కుల వృత్తి మీద ఆధాపడి జీవనం సాగిస్తున్న తమకు మండలంలోని ఓడిసి, కొండకమర్ల, యం యర్రబల్లి, నల్లగుట్లపల్లి తదితర గ్రామాల్లో దోబిఘాట్లు నిర్మించాలని కోరుతూ మండల రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందచేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బాపనపల్లి శివప్ప, రాష్ట్ర కార్యదర్శి తేలిక అంజనేయులు, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబులెన్స్ రమేష్, సత్యసాయి జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, ఓడీసి మండల కమిటీ శ్రీనివాసులు, చిరంజీవిలు పాల్గొని మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు 800 కుటుంబాలు రజకవృత్తితోనే కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. గ్రామాల్లో అరకొర సౌకర్యలతో తమ కులవృత్తిని కొనసాగించలేక పట్టణ ప్రాంతాలకు వసలు వెళుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రజకులు అధికంగా ఉన్న గ్రామాలలో దోబిఘాట్లకు స్థలాలు కేటాయించి బిసి కార్పోరేషన్ నిధులతో నిర్మాణాలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రజని, గండికోట భాస్కర్, గండికోట రామక్రిష్ణ, గండికోట నాగభూషణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్టేడియం అభివృద్ధి పనులను పరిశీలించి మంత్రి శ్రీరాములు

**బళ్లారి, నవంబర్08, ప్రభాతవార్త**



జిల్లా స్టేడియాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బి.శ్రీరాములు

జిల్లా స్టేడియం ప్రాంతాన్ని రాష్ట్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి.శ్రీరాములు సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. మంజూరైన నిధులతో స్టేడియం ఆవరణలో నూతనంగా నిర్మించిన సింథటిక్ ట్రాక్, హాకీ టర్ ్ఫ పనులు, ఇతర స్టేడియం అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పనులు పూర్తి అయితే బళ్లారిలో ప్రప్రథమంగా హాకీ టోర్నమెంటు జరిగే అవకాశం ఉంటుందని, హాకీ క్రీడాకారుల్ని ప్రోత్సహించే నేపథ్యంలో హాకీ టర్ఫ్‌ని నిర్మించినట్లు మంత్రి శ్రీరాములు తెలిపారు. అలాగే సింథటిక్ ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించేందుకు అనువుగా ఈ సింథటిక్ ట్రాక్ ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపిన ఆయన, జిల్లా స్టేడియంలోనూ ఆధునిక స్థాయిలో మైదానాన్ని తీర్చిదిద్దుతున్నట్లు, ఈతకొలను, బ్యాడ్మింటన్ కోర్టు నిర్వహణ ఉత ్తమ రీతిలో జరుగుతుందని తెలిపిన మంత్రి, మన బళ్లారి జిల్లా యువ క్రీడాకారుల ఎన్నో రోజుల కల నెరవేరబోతోందన్నారు. త్వరలోనే హాకీ టర్ ్ఫతో పాటు సింథటిక్ ట్రాక్ తదితర సేవలు క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, యువజనసేవలు క్రీడాశాఖ అధికారులు, జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, జిల్లాధికారి పవన్‌కుమార్ మాలపాటి తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్లు పరిష్కరించాలంటూ రైతుసంఘంచే ప్రతిఘటన

**బళ్లారి, నవంబర్08, ప్రభాతవార్త**

కర్ణాటక రాష్ట్ర రైతుసంఘం హసీరుసేన ఆధ్వర్యంలో వందలాది మంది రైతులు పాదయాత్ర ద్వారా మంగళవారంనాడు బళ్లారికి చేరుకున్నారు. ఈ పాదయాత్ర జిల్లాలోని సిరుగుప్ప తాలూకా ఒత్తుమురిణి నుంచి ఈనెల 1వ తేదీన ప్రారంభమై సోమవారం సాయంత్రం బళ్లారి జిల్లా అధికారి కార్యాలయానికి చేరుకుంది. జిల్లాధికారి కార్యాలయం వద్ద ప్రతిఘటనకు బైఠాయించిన రైతులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. రైతులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లాధికారి పవన్‌కుమార్ మాలపాటికి వినతి పత్రాన్ని అందజేశారు. పాదయాత్రలో సుమారు 50 గ్రామాలకు చెందిన రైతులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎన్.సూర్యనారాయణరెడ్డి పాదయాత్రలో పాల్గొని తన మద్దతు వ్యక్తం చేయడం కనిపించింది. అన్ని రకాల వ్యవసాయ రుణాల అసలులో 30 శాతం రుణాలు చెల్లించి ఓటీఎస్ ద్వారా పరిష్కరించడం, పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలను సంవత్సరం పొడవునా తెరిచి ఉంచాలని, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయాలని, దళారీల బెడదను నియంత్రించాలని, రైతుల పిల్లలకు విద్యాభ్యాసం కొరకు రుణాలు ఇచ్చేలా బ్యాంకులకు ఆదేశాలు జారీ చేయాలని, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని వారు జిల్లాధికారిని కోరారు. రైతుసంఘం అధ్యక్షుడు ఆర్.మాధవరెడ్డి, న్యాయవాది మల్లికార్జునరెడ్డి, ఆమ్ ఆద్మి పార్టీ నాయకుడు దరప్పనాయక్, పంపన్నగౌడ, రామంజిని, బసిరెడ్డి, వీరారెడ్డి, సన్నతిమ్మప్ప, నాగరాజ్, క్రిష్ణారెడ్డి, జగన్నాథరెడ్డి, ద్యావప్ప తదితర వందలాది మంది పాల్గొన్నారు.

## వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 8, ప్రభాతవార్త**

రాష్ట్రంలో వడ్డెర్ల ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఓడిసి వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందచేశారు. నాయకులు పీట్ల సుధాకర్, జెరిపిటి అంజినప్ప, కేట వెంకటరమణ, వల్లిపి ఆదినారాయణ, ఎంపిటిసి బైముతక శ్రీనివాసులు, వీరాంజినేయులు, జెరిపిటి ప్రసాద్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది వడ్డెర్లు ఉన్నారని వీరు అత్యంత దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారన్నారు. సత్యపాల్ కమిటీ చేసిన సిఫారసు మేరకు వడ్డెర్ల స్థితిగతులపై విచారించి వారిని ఎస్టీ జాబితాలో చేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

## గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**యాడికి, నవంబర్ 8 ప్రభాతవార్త**



లబ్దిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

మండలంలోని ఈరన్న పల్లి, కుందనకోట, గుడి పాడు గ్రామాల్లో మంగళ వారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొ న్నారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, మాజీ జెడ్‌పిటిసి వెంకటరామిరెడ్డి ప్రజలకు అందుతున్న నవరత్నాలు వివరించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్క లబ్దిదారునికి పథకాలు అందేలా చూడాలని సచివాలయం సిబ్బంది, వాలంటీర్లకు సూచించారు. ఈ కార్య క్రమంలో ఇన్‌చార్జ్ ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, గుడిపాడు సర్పంచు దండు సావిత్రి, ఉపసర్పంచు మద్ద శ్రీనివాసులు, యాడికి ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, బ్రహ్మానందరెడ్డి, దండు రాముడు, గుడిపాడు వెంకటరామిరెడ్డి, గుడిపాడు శంకర్, ఎంపిటిసి సభ్యులు అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ కలిగిన నాయకుడిని కాబట్టే ఈ ఆవేదన

**-మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి**

**తాడిపత్రి అర్బన్, నవంబర్ 8 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న జె.సి

నేను నిజాయితీ కలిగిన నాయకుడిని కాబట్టే ఈ ఆవేదన అని మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక నివా సంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడుతూ తాను నిజాయితీ కలిగిన నాయకున్ని కాబట్టి ఈ ఆవేదన వుంద ని ఇది ప్రజలు గమనించాలన్నారు. సజ్జల దిన్నెలో తప్పుడు డాక్యు మెంట్లు సృష్టించింది ఎవరు, ఎన్నో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాజేసింది ఎవరు దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. దీనిపై స్పందించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేము లేఖ వ్రాస్తే మమ్ముల్ని దోషులు చేస్తున్నారని ప్రభు త్వం నన్ను ఎన్ని ఇబ్బందులు పెట్టినా నేను ప్రజల పక్షాన నిలబడతానని జె.సి పేర్కొన్నారు.

## ఇంగ్లీష్ క్లబ్‌ను ప్రారంభించిన ఎజిఎం

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 8 ప్రభాతవార్త**



ఇంగ్లీష్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

పట్టణంలోని కాల్వగడ్డవీధిలో వున్న శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థుల కొరకు ఇంగ్లీష్ క్లబ్‌ను పాఠశాల ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీష్ క్లబ్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు ఇంగ్లీష్ భాషను స్పష్టంగా అనర్గలంగా మాట్లాడేందుకు అవకాశం వుంటుందన్నారు. అంతేకాకుండా ఈ క్లబ్ ద్వారా రకరకాల విద్యాపర మైనటు వంటి ఆటల ద్వారా, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా విద్యార్థినీ, విద్యా ర్థులకు ఎంతో మేలు కలుగుతుంద న్నారు. అదేవిధంగా భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు పొంద గలుగుతారన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే తమ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సిపాల్ బాబు, డీన్ నాగభూషణం, ఇన్‌చార్జ్‌లు పూజ, వైష్ణవి, రమాదేవి, నాగరాజు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 8 ప్రభాతవార్త**



ఆలయాన్ని మూసివేస్తున్న దృశ్యం

చంద్రగ్రహణం కారణంగా పట్టణంలోని పురాతన ఆలయాలైన శ్రీచింతల వేంకటరమణస్వామి, శ్రీబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు పట్టణంలోని ఆలయాలను మంగళవారం ఉదయం 8 నుండి రాత్రి 7 గంటల వరకు మూసివేశారు. ఇందులో భాగంగా శ్రీచింతల వేంకటరమణ స్వామి ఆలయంలో వేకువజామున సుప్రభాతసేవ కైంకర్యాల అనంతరం ఆలయాన్ని మూసివేశారు. గ్రహణం అనంతరం ఆలయాన్ని శుద్ధిచేసి పుణ్యాహవాచనము, కైంకర్యాలు నిర్వహించడం జరుగుతుందని అర్చకులు మురళిస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు కనకాద్రి లక్ష్మీదేవి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పదవికి జేసీ అనర్హుడు



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రమిస్తున్న దళిత సంఘాల నాయకులు

**తాడిపత్రి, ప్రభాతవార్త**

రాజ్యాంగ విధానాలను అమలు పరిచే హోదాలో ఉన్న జిల్లా కలెక్టర్‌ను తన స్వలాభం కోసం దూషించిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి రాజ్యాంగ పదవికి అనర్హుడని పలువురు దళిత సంఘాల నాయకులు మంగళవారం విమర్శించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో సోమవారం జేసీ ప్రభాకర్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక బస్టాండు వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వారు వినతి పత్రమిచ్చి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌పై అనుచితంగా ప్రవర్తించిన జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ దళిత సంఘాల నాయకులు గురుశంకర్, పెద్దరాజు,విజయభాస్కర్, వెంకటశివ, కౌన్సిలర్‌లు రాఘవేంద్ర ప్రసాద్, నాగభూషణం తదితరులు డిమాండ్ చేశారు.

## సత్తా చాటిన కిడ్స్‌కేవ్ స్పోర్ట్స్ అకాడమి బౌలర్లు

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 8 ప్రభాతవార్త**



ప్రతిభ చూపిన బౌలర్లు

గుంతకల్లులో జరిగిన అండర్-15 బాలుర క్రికెట్ పోటీల్లో తాడిపత్రి పట్టణానికి చెందిన కిడ్స్ కేవ్ స్పోర్ట్స్ అకాడమి బౌలర్లు తమ సత్తాచాటారు. ముందుగా టాస్ గెలిచి బ్యాలింగ్ ఎంచుకున్న తాడిపత్రి జట్టు నిర్ణీత 50 ఓటర్లలో 131 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంతకల్లు జట్టు 48 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌట్ అయింది. ఇందులో కిడ్స్ కేవ్ స్పోర్ట్స్ అకాడమికి చెందిన పి.భార్గవన్ తన బౌలింగ్ ప్రతిభతో 10 ఓవర్లలో కేవలం 17 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసుకుని సత్తా చాటాడు. అలాగే అక్షయ్ కూడా మంచి బౌలింగ్‌తో గుంతకల్లు జట్టును ఇరకాటంలో పడవేశారు. ప్రతిభ చూపిన వారికి కిడ్స్ కేవ్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ బి.నాగసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు. అదేవిధంగా వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ హాజీవలి, దాదుకలందర్‌లకు ఆయన అభినందనలు తెలిపారు.

## కూలీలను పలకరించిన ఎమ్మెల్యే

**యల్లనూరు, నవంబర్ 8 ప్రభాతవార్త**



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

మండలంలోని గడ్డంవారిపల్లి చెరువువద్దకు వెళుతున్న సమయంలో కోడుమూర్తి వెళ్లే దారిలో పత్తి పంట కోస్తున్న కూలీలను చూసి అక్కడ ఆగి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పంట పొలంలోకి వెళ్లి కూలీలను పలకరించారు. అలాగే పత్తి పంటను పరిశీలించారు. పత్తి పంటలో నష్టాలు వస్తున్నాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పత్తి పంట గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. అక్కడ వున్న కూలీలు మాట్లాడుతూ కోడుమూర్తి నుండి చిలమకూరు వద్ద వున్న మోడల్‌స్కూల్‌కు పిల్లలు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల చిత్రావతి నది ప్రవహించి రోడ్డు మొత్తం కోతకు గురైందని దీంతో పిల్లలు యల్లనూరుకు వెళ్లి అక్కడి నుండి వెళుతూ ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ అధికారులతో మాట్లాడి మీ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సర్పంచు రామాంజులరెడ్డి వున్నారు.

## నాలుగు గ్రామాల్లో పత్తి పంట పరిశీలన

**- పెద్దపప్పూరులో జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల పర్యటన**



పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**పెద్దపప్పూరు, నవంబర్ 8 ప్రభాతవార్త**

పెద్దపప్పూరు మండల వ్యాప్తంగా నరసాపురం, గార్లదిన్నె, పసలూరు, సుంకేసుల గ్రామాల్లో సాగుచేసిన పత్తి పంటలో గులాబిరంగు పురుగు ఉద్ధృతిని పరిశీలించేందుకు జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల బృందం మంగళవారం పర్యటించింది. జిల్లా రీసోర్ ్స డైరెక్టర్ మద్దిలేటి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పురుగులు అరికట్టడానికి యాజమాన్య పద్దతులను సూచించారు. రైతులు అందరూ ఫెరమోన్ ట్రాప్‌లను వాడాలన్నారు. అలాగే సామూహికంగా రైతులు అందరూ సమ్మర్ పత్తిని సాగుచేయకూడదన్నారు. కాయ కుళ్ల తెగులు కూడా గమనించి వెంటనే తీసుకోవాల్సిన జా గ్రత్తలు తెలియచేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌రెడ్డి వేసవిలో ముందస్తుగా సాగుచేయడం వల్ల గులాబి రంగు పురుగు ఉధృతి ఎక్కువగా రావడం జరుగుతుందని రైతులకు ప్రత్యక్షంగా పురుగును చూపించారు. వేసవిలో తొలకరిలో పత్తి సాగుచేయడం వల్ల గులాబి రంగు పురుగు మళ్లీ ఖరీఫ్ పత్తికి కూడా ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు. అనంతరం పసలూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి డైరెక్టర్ మద్దిలేటి, తాడిపత్రి ఎడిఎ చెంగలరాయుడు, మండల ఎఒ ఆంజనేయులు, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌రెడ్డి, ఆర్‌బికె సిబ్బంది ప్రవీణ, రైతులు పాల్గొన్నారు.

## సమస్యలు తెలుసుకున్న జె.సి అశ్మిత్‌రెడ్డి



వార్డులో తిరుగుతున్న జె.సి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 8 ప్రభాతవార్త**

పట్టణంలోని ఓంశాంతినగర్, ఇందిరానగర్‌లో మంగళవారం తెలుగుదేశం పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇక్కరు వీధులను శుభ్రంగా వుంచుకోవాలన్నారు. అంతేకాకుండా సీజనల్ వ్యాధులకు దూరంగా వుండాలని ఆయన ప్రజలకు తెలియచేశారు. ఈ కార్య క్రమంలో కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, జె.సి అనుచరులు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జె.సి ప్రభాకర్‌రెడ్డి తీరు హేయం - వైకాపా



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

**యాడికి, నవంబర్ 8 ప్రభాతవార్త**

జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ అనే హోదాకు ఇవ్వాల్సిన కనీస గౌరవం ఇవ్వకుండా జె.సి ప్రభాకర్‌రెడ్డి ప్రవర్తించిన తీరు చాలా హేయమైనదని వైకాపా నాయకులు పేర్కొన్నారు. యాడికి వైకాపా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైకాపా నాయకులు నాయకులు మాట్లాడుతూ 30 సంవత్సరాల రాజకీయ చరిత్ర అంటూ ప్రగల్భాలు పలికే జె.సి ప్రభాకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌తో సభ్యత లేకుండా ప్రవర్తించడం అనుచితంగా మాట్లాడడం ఇదా నీవు నేర్చుకున్నదని వైకాపా నాయకులు విమర్శించారు. స్పందన కార్యక్రమంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తన సమస్యలు తెలిపేందుకు వెళ్లిన జె.సి ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగిన విషయం పాఠకులకు విదితమే. ఈ సమావేశంలో కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, మాజీ జెడ్‌పిటిసి వెంకటరామిరెడ్డి, ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, నాగరాజు, రామ్మోహన్, రామాంజులరెడ్డి, రామిరెడ్డి, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగనాథస్వామి ఆలయం మూసివేత

**తాడిపత్రిరూరల్, నవంబర్ 8 ప్రభాతవార్త**



ఆలయ తలుపులు మూసివేస్తున్న అర్చకులు

చంద్రగ్రహణం కారణంగా మండలంలోని ఆలూరుకోనలో వెలసిన శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని మంగళవారం మూసివేశారు. తెల్లవారుజామునే స్వామివారికి పూజా కైంకర్యాలు నిర్వహించి ఉదయం 8 గంటలకు అర్చకులు ఆలయం తలుపులు మూసివేశారు. తిరిగి గ్రహణం అనంతరం ఆలయ ద్వారాలు తెరిచి శుద్ధి చేసి స్వామివారికి పూజాకైంకర్యాలు నిర్వహించారు.

## రైతులు వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

**నంబులపూలకుంట, నవంబర్ 8, ప్రభాతవార్త:**

మండలంలోని స్థానిక రైతు భరోసా కేంద్రాలలో నేటి నుండి వేరుశనగ కాయలు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. ఒక రైతుకు 3 బ్యాగ్‌లు మాత్రమే తీసుకోవడానికి అర్హులు. ఒక బ్యాగ్ రూ. 1545, రెండు బ్యాగ్‌లు రూ. 3090, మూడు బ్యాగ్‌లు రూ. 4635 గా ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న రోజే నగదు చెల్లించాలి. కావున మండలంలోని ప్రతి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.

